బస్సుకి తన అవసరాలకు. ఉద్యోగం చేస్తే తనకంటూ సంపాదన వుంటుంది నచ్చినట్లుగా ఖర్చు పెట్టుకోవచ్చు ననుకున్నాను. కానీ తనకన్నా ముందే ఎదురు చూస్తూ ఆ జీతం కవరు లాక్కుంటే ఇక ఆర్థిక స్వేచ్ఛ ఎక్కడుంది? ఎప్పుడయినా తన వాళ్ళెవరయినా వస్తే మళ్ళీ ఆయన ముందు చేయి జాపాల్సిందే. అది ఇష్టంలేక నా ఖర్చులన్ని చాలామటుకు కట్ చేసి అయిదు వేలు దాచగలిగాను. ఒకసారి 'ఇంటాబయటా చేయలేకపోతున్నాను. ఉద్యోగం మానేస్తాను' అంటే ఆయన దారికొచ్చాడు. 'ఆ పని మాత్రం చేయకు. సెలవు రోజున నీకు సాయం చేస్తాను' అని 'మంచితనం' ముసుగు వేసుకున్నాడు. ఆ ముసుగు మనిషినే మీరు చూస్తున్నారు. నేను వుద్యోగం మానేస్తే ఆ ముసుగు తీసేసి మామూలు శేషాద్రి అయిపోతాడు" అంది పద్మ తేలికగా నవ్వుతూ. పద్మకి కాఫీ ఇచ్చి పంపుతూ, "ఎలాంటి సాయమైనా చేస్తాను. మొహమాటపడక అడుగు పద్మా" అంది జాలి నిండిన మనసుతో.

పద్మ వెళ్లాక తను కూడా 'గయ్యాళి' ముసుగు ధరించి భర్తను ఆడించడం గుర్తొచ్చింది. రామారావుకి ఎలాటి వ్యసనాలు, అలవాట్లు లేవు. ఆఫీసు, ఇల్లు ప్రపంచం. జీతం కటింగులు పోగా మొత్తమంతా తన చేతుల్లో పోస్తాడు. తను ఏం చేసినా, ఎలా ఖర్చుపెట్టినా ఏనాడూ అడగడు. పొద్దున్న పోయి, రాత్రికి వస్తాడు. అయినా తను ఇంట్లో వుండి కష్టపడిపోతున్నట్లు, అతడు బయటికెళ్ళి సుఖపడిపోతున్నట్లు సాధిస్తుంది. ఎంత విదిలించినా అదిలించినా పల్లెత్తు మాట అనడు. తనకున్న స్వేచ్ఛ, స్వాతంత్ర్యం పద్మకెక్కడిది? పద్మ వచ్చి తన కళ్ళు తెరిపించింది. ఇక నుండీ తన భర్తను సాధించకుండా మంచిగా చూసుకోవాలని నిర్ణయానికి వచ్చిన సరోజ తను కూడా 'గయ్యాళి' ముసుగుని తొలగించి, స్వచ్ఛమైన మనసుతో భర్త రాకకై ఎదురు చూడసాగింది.

అయితే సరోజకి తెలీని దేవరహస్యం- ప్రతిరోజూ సరోజ రామారావుని పెట్టే సాధింపులు, విదిలింపులు అన్నీ వారి చెవిన పడుతున్నాయని, సరోజలో పరివర్తన కోసమే శేషాద్రి 'విలన్' ముసుగు ధరించి పద్మతో ఆ కథ చెప్పించాడని.

**-ఎ.రాజరాజేశ్వరి** (బెంగుళూరు)

# చివరి కోరిక

**"రెడ్డిగారూ! ఎప్పుడొచ్చారు? ఈ యేడాది మామిడికాయలు విపరీతంగా కాసాయి. దొంగలు పడకుండా జాగ్రత్తగా చూస్తున్నాను" చెబుతున్నాడు పుట్టాలు.**

**"పుట్టాలూ! అవన్నీ ఎందుకు? నిన్నేమైనా అడిగానా? మా నాన్న హయాం నుంచి ఈ తోటలో పనిచేస్తున్నావు. స్వంత తోటలా భావించే నిన్ను ఎప్పుడైనా ఏదైనా అంటే అది నా పొరపాటు అని అనుకుంటాను. అది సరేగాని, టెంకాయలు అమ్మకం ఎప్పుడు పెట్టావు?" అడిగాడు రెడ్డిగారు.**

"రేపు వచ్చి బండిలో తీసుకెళ్తారయ్యా. డబ్బులు రమేష్ రెడ్డిగారికి ఇచ్చిపోతామన్నారు. మీ ఇంటికి రాలేదా?" అన్నాడు పుట్టాలు.

ఆ తోట గుసుపాటి ఆదిశేషారెడ్డి వాళ్ళది. తోటమాలిగా వాళ్ళ నాన్న హయాం నుండి పనిచేస్తున్నాడు పుట్టాలు. రెడ్డిగారు ఇచ్చింది తీసుకుంటాడు గానీ అడగడు. వాళ్ళకు కూడా పుట్టాలు అంటే మనస్సులో అంత అభిమానం.

వైరు మంచం మీద పడుకొన్నాడు శేషారెడ్డి. అప్పుడే వారి రెండవ కుమారుడు రమేష్ రెడ్డి తోటలోనికి వచ్చాడు. అక్కడ కుర్చీ వేశాడు పుట్టాలు. శేషారెడ్డిగారు నవ్వుతూ "పుట్టాలూ! నీవు చనిపోయినా కూడా ఇక్కడే సమాధి కట్టిస్తే, గాలిలో కాపలా కాస్తుంటావు కాబోలు" అన్నాడు.

"అయ్యగారూ! నాకు డెబ్భై ఏళ్ళు వచ్చాయి. మీ అండతో నా కుటుంబం ఏ దిగులూ చింత లేకుండా గడుస్తున్నది. మీ దయవలన సంసార బాధ్యతలన్నీ సక్రమంగా నిర్వర్తించాను. అయితే ఒక్క కోరిక నాకు మిగిలి ఉంది. అబ్బాయి ఎదురుగా చెబుతున్నాను. నేను చస్తే, తెలిసిన వెంటనే మీరు రావద్దు" అన్నాడు.

"అదేమిటి అలాగంటావు పుట్టాలూ! ఇన్నాళ్ళు మాకు సేవ చేసిన నిన్ను కనీసం చూడ్డానికి కూడా రావద్దంటావే?" అన్నాడు రమేష్ రెడ్డి.

"అది కాదు అయ్యా! నాకు ఏ కోరిక లేదు. ఇంతవరకు మా గూడెంలో ఎవరు చచ్చిపోయినా పూల మాల వేసేవారే లేరు. నాకు నా శవంపై పెద్ద పూలమాల వేయించుకోవాలని ఉంది" అన్నాడు పుట్టాలు.

తరువాత ఆరు నెలలు గడిచాయి. రెడ్డిగారు కుమారునితో తోటలోనికి వచ్చారు. "అయ్యా! పుట్టాలయ్యకి గుండెనొప్పి అంట. ఇందాకే చనిపోయాడు" అని వాళ్ళ తమ్ముడు వచ్చి చెప్పాడు.

"నాన్నా! నేను గంటలో వస్తాను. ఇక్కడే ఉండండి" అంటూ కారులో నెల్లూరు పోయి వచ్చాడు రమేష్ రెడ్డి. కారులో ఆరు వందల రూపాయలు విలువ చేసే పెద్ద గులాబీ మాల, పెద్దగంప నిండా పూలు. ఇద్దరూ కలసి పుట్టాలుకు మాల వేసి శ్రద్ధాంజలి ఘటించి, సమాధి పూర్తయిన తర్వాత ఇంటికి బయలుదేరారు.



సంవత్సరాలుగా తమ కుటుంబానికి సేవలందించిన పుట్టాలు చివరి కోరిక తీర్చినందుకు ఎంతో తృప్తిగా ఉంది రెడ్డిగారికి.

**-తిప్పావఝుల సుబ్రహ్మణ్యం**

(ఇందుకూరుపేట)